క్లుప్తంగా

వెంకటాద్రిపై విశేష పూజలు



పెందుర్తి : వెంకటాద్రిపై శనివారం వేంకటేశ్వరస్వామికి విశేషంగా పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, తోమాలసేవ నిర్వహించారు. అనంతరం సహస్రనామార్చన, అష్టోత్తరంపూజ, దూపసేవ, దీపోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు.

సింహాచలం చేరుకున్న భక్తులు

సింహాచలం: గంధం అమావాస్య సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు శనివారం సాయంత్రానికే సింహాచలం చేరుకున్నారు. చందనోత్సవం ముందు వచ్చే ఈ అమావాస్యను భక్తులు పవిత్రంగా భావిస్తారు. కుటుంబాలతో తరలివచ్చి వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి, వంటలు చేసుకుని భోజనాలు చేస్తారు. ఈసారి అమావాస్య ఆదివారం కావడంతో శనివారం సాయంత్రానికే భక్తులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. వరాహ పుష్కరిణి మార్గం భక్తులతో నిండిపోయింది.

కోడెదూడల బాధ్యత ఎవరిది?



భక్తులు వదిలివెళ్లిన కోడెదూడలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకోవడానికి శనివారం వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో కోడెదూడలను సమర్పించారు. కొండ దిగువన ఉన్న తొలిపావంచ వద్ద వాటిని స్వామికి సమర్పించి వెళ్లారు. అయితే, వాటి సంరక్షణపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానం కేవలం దేశవాళీ కోడెదూడలను మాత్రమే స్వీకరించి శ్రీకృష్ణాపురంలోని గోశాలకు తరలిస్తోంది. జెర్సీ కోడెదూడలను గతంలో పూచీకత్తుపై రైతులకు ఇచ్చేవారు. ప్రస్తుతం శనివారం భక్తులు వదిలివెళ్లిన కోడెదూడలను తొలిపావంచ వద్ద ఉన్న పాకలో సంరక్షకులు ఉంచారు. ఈ విషయంపై దేవస్థానం అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

కూలేందుకు సిద్ధంగా..



కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

పరవాడ: పెదముషిడివాడ-విజయరాంపురం మధ్య నిర్మిస్తున్న రహదారి పనుల్లో ఒక భారీ యంత్రం తగలడంతో హెచ్‌టీ విద్యుత్ లైన్‌లోని ఒక స్తంభం సగానికి పైగా ఒరిగిపోయింది. ఆ స్తంభానికి హెచ్‌టీ, ఎల్‌టీ వైర్లు ఉండటంతో అది నేలకొరిగితే మిగిలిన స్తంభాలు కూడా పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కూలడానికి సిద్ధంగా ఉన్న ఈ స్తంభాన్ని వెంటనే సరిచేయాలని స్థానికులు ఏపీ ఈపీడీసీఎల్ అధికారులను కోరుతున్నారు.

భక్తుల సౌకర్యార్థం షాపుల తొలగింపు

సింహాచలం : సింహగిరిపై పాదాలమ్మ-బంగారమ్మ ఆలయ ప్రాంగణంలో వర్తకులకు తాత్కాలికంగా ఇచ్చిన దుకాణాలను చందనోత్సవం రోజు భక్తుల సౌకర్యార్థం పార్కింగ్ కోసమే ఖాళీ చేయించామని సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె. సుబ్బారావు శనివారం స్పష్టం చేశారు. సీఎం కాన్వాయ్ పార్కింగ్ కోసం కాదని ఆయన తేల్చి చెప్పారు. సింహగిరిపై పార్కింగ్‌కు తగినంత స్థలం లేకపోవడంతో ఆరు నెలల క్రితమే పాదాలమ్మ, బంగారమ్మ ఆలయాల ప్రాంగణాన్ని పార్కింగ్‌కు ఎంపిక చేశామన్నారు. ప్రసాద్ పథకంలో భాగంగా టూరిజం శాఖ 67 దుకాణాలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఇవ్వడంతో వర్తకులను అక్కడికి పంపించామని తెలిపారు. చందనోత్సవానికి రెండు లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నందున, వారి సౌకర్యార్థం పాదాలమ్మ-బంగారమ్మ ఆలయ ప్రాంగణాన్ని పార్కింగ్‌కు వినియోగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

శేఖర్ గురుస్వామికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శేఖర్ గురుస్వామి

పెందుర్తి : సుజాతనగర్‌లోని అయ్యప్ప సేవా చారిటబుల్ ట్రస్ట్, సాయి కంచి వెంకారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్, ట్రస్టీ డాక్టర్ వాకా చంద్రశేఖర్ (శేఖర్ గురుస్వామి)కి తమిళనాడులోని హొసూరులోని ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. సుజాతనగర్‌లోని శ్రీ పూర్ణ పుష్కల సమేత శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయం ప్రపంచంలోనే మొట్టమొదటిదిగా గుర్తింపు పొందింది. ఈ ఆలయ నిర్మాణకర్త, ధర్మకర్తగా శేఖర్ గురుస్వామి అనేక సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవ డాక్టరేట్ లభించింది.

గొంతుతడపని జల్‌జీవన్ మిషన్ | గత ప్రభుత్వ హయాంలో రూ.14.22 కోట్లు మంజూరు | చాలా గ్రామాలకు తాగునీరు | కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పనులు రద్దు | కలగా మిగిలిన ఇంటింటా కుళాయి కనెక్షన్

ఇంటింటా కుళాయి.. ఇంకెంతదూరం



మండలంలో గ్రామ పంచాయతీలు	24
మండలంలో మొత్తం గృహాలు	16,789
ఇప్పటి వరకూ ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసిన గృహాలు	4,704
గత ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ పథకానికి విడుదలైన నిధులు	రూ.14.22 కోట్లు
పూర్తి చేసిన పనులు	రూ.7.72 కోట్లు
రద్దైన పనులు	రూ.6.5 కోట్లు

సబ్బవరం: ప్రతి ఇంటికీ తాగునీటిని అందించే లక్ష్యంతో గత వైఎస్సార్ ప్రభుత్వం చేపట్టిన జలజీవన్ మిషన్ కింద సబ్బవరం మండలంలోని ప్రతి గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేయడానికి సుమారు రూ. 14.22 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా రూ. 7.72 కోట్ల నిధులతో 26 పనులను ప్యాకేజీలుగా విభజించి పలు గ్రామాలకు తాగునీటిని అందించే పనులు చేపట్టారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేయగా, మరికొన్ని గ్రామాల్లో పైప్‌లైన్ల విస్తరణ, వాటర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం వంటి పనులు పూర్తయ్యాయి. దీంతో ఆయా గ్రామాలకు తాగునీటిని అందిస్తున్నారు. ఇదంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మేలు...కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పథకంపై నిర్లక్ష్యం చూపుతోంది. సుమారు రూ.6.2 కోట్ల నిధులతో చేపట్టాల్సిన పనులను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో ఇంటింటికీ కుళాయి కలగా మిగిలిపోయే అవకాశం ఉంది.

నిలిచిపోయిన పనులు

జలజీవన్ మిషన్ పథకంలో మరో రూ. 6.2 కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. అయితే, కొన్ని చోట్ల పనులు ప్రారంభం కాగా, మరికొన్ని తొలి దశలో ఉండగానే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ పనులను రద్దు చేసింది. దీంతో ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలనే గత ప్రభుత్వ సంకల్పం ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయంతో నిలిచిపోయింది. మండలంలోని గొల్లలపాలెం, రావలమ్మపాలెం, అమృతపురం, ఆరిపాక, ఎరుకునాయుడుపాలెం, సూరెడ్డిపాలెం, సబ్బవరం వంటి పలు గ్రామాల్లో గత ప్రభుత్వం అధిక శాతం గృహ వినియోగదారులకు తొలి దశలోనే ఇంటింటికీ తాగునీటి కొళాయిలను ఏర్పాటు చేసి వినియోగంలోకి తెచ్చింది.



వంగలిలో జలజీవన్ మిషన్ నిధులతో ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంకు



అసకపల్లి ఎస్సీ కాలనీలో మరమ్మతులు చేపట్టిన ఓవర్ హెడ్ ట్యాంకు



ఎల్లుప్పిలో నూతనంగా నిర్మించిన 20 వేల లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంకు

గత ప్రభుత్వంలో పూర్తయిన పనుల వివరాలు

	రూ. లక్షల్లో
రాపర్తివానిపాలెం	13.46
ఒమ్మువానిపాలెం	11.30
బొండవానిపాలెం	14.75
సాలాపువానిపాలెం	14.06
అమృతపురం	30.25
అసకపల్లి	28.30
ఎరుకునాయుడుపాలెం	16.93
పెదనాయుడుపాలెం	27.90



అసకపల్లిలో మరమ్మతులు చేపడుతున్న ఇంటింటి తాగునీటి కుళాయి పైపు లైన్

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి



జలజీవన్ మిషన్ (జేజేఎం) నిధులతో మండలంలో ఇప్పటివరకు పలు పనులు చేపట్టి ఇంటింటికీ తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేశాం. మండలంలో మరిన్ని గ్రామాల్లో ఈ సౌకర్యం కల్పించాల్సి ఉంది. అయితే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు మంజూరైనప్పటికీ, కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులను రద్దు చేసింది. ఈ విషయంపై ప్రభుత్వం భవిష్యత్తులో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

–డి.శ్రీనివాస్,
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, సబ్బవరం మండలం

ఆలయానికి బీరువా వితరణ



ఆలయ కమిటీ అధ్యక్షుడినికి బీరువా తాళాలను అందజేస్తున్న దాతలు

పరవాడ: మండలంలోని ఈ.బోనంగి శివారు ఫార్మాసిటీ కాలనీ సమీపంలో ఉన్న శ్రీ భూసమేత అభయ వేంకటేశ్వరస్వామి ఆలయానికి గౌతులచ్చన్ననగర్‌కు చెందిన అండిబోయిన ముత్యాలు దంపతులు తమ సొంత ఖర్చులతో బీరువాను విరాళంగా అందించారు. శనివారం బీరువాను ఆలయ కమిటీ అధ్యక్షుడు బుగిడి రామగోవిందరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సీహెచ్‌వీ సత్యనారాయణ, ఆర్‌వీ నారాయణ, ఆర్.ధనరాజు పాల్గొన్నారు.

తాడి గ్రామం తరలింపునకు ఇంటింటా సర్వే



తాడిలో నిర్వహిస్తున్న ఇంటింటా సర్వేలో పాల్గొన్న తహశీల్దారు

పరవాడ: కాలుష్యంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న తాడి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు గ్రామంలో ఇంటింటి సర్వే కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఇటీవల అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఈ విషయాన్ని కలెక్టర్ విజయకృష్ణన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు కలెక్టర్ ఆదేశాలతో పరవాడ తహశీల్దార్ ఎస్వీ అంబేద్కర్ 8 బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు పంచకర్ల ప్రసాద్ మాట్లాడుతూ, సర్వేలో రాజకీయాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. తహశీల్దార్ అంబేద్కర్ మాట్లాడుతూ, ఇంటింటా నివసిస్తున్న కుటుంబ సభ్యులు, మేజర్ కుమారులు, కుమార్తెలు తదితర వివరాలను సర్వే అధికారులకు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చి ఉదయం 9:30 గంటల నుంచి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు వంటి ఘట్టాలతో కల్యాణ వేడుక కొనసాగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.అంతకుముందు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడ సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో జరిగిన ఈ సేవలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడ వాహనంపై అధిష్ఠింపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ అనంతరం భక్తులు గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. విశేష హారతులు సమర్పించారు.

ముగిసిన చందనం అరగదీత

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తొలి విడత చందనం అరగదీత శనివారంతో పూర్తయింది. ఈనెల 30న చందనోత్సవాన్ని పురస్కరించుకుని స్వామికి సమర్పించాల్సిన మూడు మణుగుల(సుమారు 125 కిలోలు) పచ్చి చందనాన్ని సమకూర్చేందుకు ఈనెల 24వ తేదీ నుంచి అరగదీతను ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా మూడు రోజుల్లోనే అరగదీతను సిబ్బంది పూర్తిచేశారు. కావాల్సిన సుమారు 125 కిలోల పచ్చి చందనాన్ని సిద్ధం చేశారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



మర్రిపాలెం టోల్ గేట్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న అడిషనల్ ఎస్పీ మోహన్‌రావు, డీఎస్పీ విష్ణుస్వరూప్ తదితరులు

సబ్బవరం: అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై మర్రిపాలెం టోల్‌గేట్ వద్ద జిల్లా అడిషనల్ ఎస్పీ మోహన్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం వాహనాల తనిఖీలు ముమ్మరంగా నిర్వహించారు. జమ్మూ -కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడుల నేపథ్యంలో ఆయుధాల తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించి ఈ తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఈ ప్రత్యేక తనిఖీ డ్రైవ్ కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో భాగంగా అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో గుల్లేపల్లి కూడలిలో మరో బృందం తనిఖీలు చేసింది. ఈ తనిఖీల్లో పరవాడ డివిజన్ డీఎస్పీ విష్ణుస్వరూప్, ఎస్ఐ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: వివిధ ప్రతిభావంతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్, దివ్యాంగుల పథకాల అమలు ప్రతి శాఖలో నోడల్ అధికారి పర్యవేక్షణలో జరగాలని సూచించారు. దివ్యాంగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్య సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని, వారి హక్కులు, చట్టాలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. దివ్యాంగుల పిల్లలకు విద్య అందేలా చర్యలు తీసుకోవాలని, వారు అన్ని ప్రదేశాలను సందర్శించేందుకు వీలుగా ర్యాంపులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ ప్రతిభావంతుల శాఖ ఏడీ మాధవితో పాటు అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వయోవృద్ధుల పోషణ, సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు డివిజనల్, మండల స్థాయిలో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా సీనియర్ సిటిజన్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

పెందుర్తి: పెందుర్తి గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా ఆదివారం సాయంత్రం ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పెందుర్తి ఎస్ఐ నరసింగరాజు శనివారం తెలిపారు. విశాఖ నుంచి బోడవరం వెళ్లే వాహనదారులు వేపగుంట జంక్షన్ నుంచి పినగాడి మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి కొత్తవలస వెళ్లే వాహనదారులు వేపగుంట జంక్షన్ నుంచి రాంపురం, పినగాడి, ఎన్‌హెచ్-16 సర్వీస్ రోడ్డు నుంచి సరిపల్లి మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి ఆనందపురం వెళ్లే వాహనదారులు వేపగుంట జంక్షన్ నుంచి పాత గోశాల, అడవివరం, సత్తరువు మీదుగా వెళ్లాలి. వాహనదారులంతా ఈవిషయాలను పరిగణలోకి తీసుకుని పోలీసులకు సహకరించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పరవాడ: తాడి రైల్వే స్టేషన్ సమీపంలోని తుప్పల్లో గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని గుర్తించినట్లు పరవాడ ఎస్ఐ బి.కృష్ణారావు తెలిపారు. రైల్వే ట్రాక్‌కు 50 మీటర్ల దూరంలో ఉన్న మృతదేహాన్ని పరిశీలించి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడి వయస్సు 40-50 మధ్య ఉంటుందని, 5.6 అడుగుల ఎత్తు, నలుపు రంగు కలిగి ఉన్నాడని చెప్పారు. మృతుడు బ్రౌన్ కలర్ ఫుల్ ప్యాంటు, వైట్ కలర్ బనియన్, ఎరుపు రంగు మొలతాడు ధరించి ఉన్నాడని, మెడలో హనుమాన్ వెండి బిళ్ల ఉందని తెలిపారు. మృతుడు నాలుగైదు రోజుల క్రితం మరణించి ఉంటాడని భావిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు 9440796088 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

ఆర్చరీ పోటీల విజేత ఒడిశా



ఆర్చరీ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు

కొమ్మాది : బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న జన జాతీయ గౌరవ్ వర్ష కార్యక్రమంలో భాగంగా జన జాతీయ ఖేల్ మహోత్సవ్-ట్రైబల్ ఆర్చరీ మీట్ శనివారం గీతం కళాశాల ప్రాంగణంలో ఘనంగా ముగిశాయి. రెండో రోజు ఆర్చరీ మీట్‌ను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి శంకర్రావు పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన టీసీఆర్‌టీఎం బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆర్చరీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, తెలంగాణ, అండమాన్ నికోబార్‌లతో పాటు రాష్ట్రంలోని 8 ఐటీడీఏల నుంచి సీనియర్, జూనియర్ స్థాయిలో గిరిజన క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ఒడిశాఖ మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, రెండో స్థానాన్ని తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకుంది. విజేతలకు టీసీఆర్‌టీఎం ఈడీ రాణిమందా సర్టిఫికెట్లను, బహుమతులును అందజేశారు.

ట్రైలర్ మేకింగ్‌లో అన్వేష్‌కు 6వ స్థానం



అన్వేష్‌ను సత్కరిస్తున్న గంట్ల శ్రీనుబాబు తదితరులు

దాబాగార్డెన్స్ : ముంబైలో వచ్చే నెల 1 నుంచి 4 వరకు జరిగే వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్మెంట్ సమ్మిట్‌లో ట్రైలర్ మేకింగ్ పోటీలో విశాఖకు చెందిన నిష్షల అన్వేష్ టాప్-20లో 6వ స్థానంలో నిలిచాడు. శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన అభినందన సభలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, యూట్యూబర్లు, కంటెంట్ క్రియేటర్స్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. అన్వేష్ రూపొందించిన 'గన్స్ అండ్ గులాబీ' ట్రైలర్‌కు ఈ గుర్తింపు లభించింది. ఈ నెల 30న ముంబైలో అవార్డు ప్రదానం చేయనున్నారు. అన్వేష్ తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక వ్యక్తి కావడం విశేషమని శ్రీనుబాబు అన్నారు. ఈ సందర్భంగా అన్వేష్‌ను సత్కరించారు.

తాగునీరు, వీధి దీపాల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఐద్వా ప్రతినిధి మాణిక్యం

పరవాడ: గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వాసుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అఖిల భారత ప్రజాస్వామిక మహిళా సంఘం (ఐద్వా) అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. శనివారం కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, భవనాలపై ఉన్న ట్యాంకులు పగిలి నీరు వృథా అవుతోందని, ఒకరికి నీరు దొరికితే మరొకరికి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాటర్ ట్యాంకులకు మరమ్మతులు చేయాలని కోరినా ఫలితం లేదన్నారు. వేసవిలో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలనీలోని పార్కుల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళ భయంతో జీవిస్తున్నారని, అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం, గంజాయి బ్యాచ్‌లు స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, దొంగతనాలు తరచూ జరుగుతున్నాయని చెప్పారు. కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మాణిక్యం అభిప్రాయపడ్డారు. సమావేశంలో మహిళా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సీతామహాలక్ష్మి, మాధురి, వరలక్ష్మి, లావణ్య, గాయిత్రి, రాజేశ్వరి, మణి, సంతోషి పాల్గొన్నారు.

లిక్విడ్ గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



లిక్విడ్ గంజాయి

పెందుర్తి: మూడు లక్షల విలువచేసే రెండు కిలోల లిక్విడ్ గంజాయి (హేష్ ఆయిల్)ని స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను పెందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. శనివారం మధ్యాహ్నం 12.30గంటల సమయంలో పెందుర్తి రైల్వేస్టేషన్‌కు సమీపంలోని దొగ్గవానిపాలెం వద్ద సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ స్వామినాయుడు, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. గుంటూరు జిల్లాకు చెందిన మంద మార్తమ్మ, కంప జీసస్‌కుమార్ రెండు కిలోల లిక్విడ్ గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారు. వారి నుంచి లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు.

పెందుర్తిలో కొవ్వొత్తులతో నిరసన



పెందుర్తిలో ర్యాలీ చేస్తున్న సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు, విద్యార్థులు

పెందుర్తి : జమ్ముకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ పెందుర్తి కూడలిలో సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు, అమత ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ విద్యార్థులు శనివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన చేశారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఉగ్రదాడిలో అమరులైన పౌరలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు ఉమాశంకర్, ఆళ్ల చిరంజీవి, సూర్యనారాయణ, శివకష్ణ, సునీత, భాను పాల్గొన్నారు.

మహిళకు బెదిరింపులు.. కేసు నమోదు

ఎంవీపీకాలనీ: కేఆర్‌ఎం కాలనీకి చెందిన కె.రూప అనే మహిళను చంపేస్తానని ఓ వ్యక్తి బెదిరించడంపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. కేఆర్‌ఎం కాలనీలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్న రూపకు ఎంవీపీ కాలనీ గాదిరాజు ప్యాలెస్ సమీపంలో ఉండే సాలి గ్రాము సతీష్ అనే వ్యక్తితో సాన్నిహిత్యం ఉంది. వీరి మధ్య ఆర్థిక లావాదేవీలు, సమస్యల కారణంగా గత నెల 3న ఆమెను చంపడానికి సతీష్ ప్రయత్నించాడు.

దీంతోపాటు ఈ నెల 9న కేఆర్‌ఎం కాలనీలోని రూప ఇంటికి వెళ్లి బెదిరించడంతోపాటు దూషించాడు. తరచూ ఫోన్ చేసి బెదిరింపులకు గురిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బాధితురాలు రూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.